# ఉత్తరాల కథ

## —పోతనాటి బాబు

రగ్గి చచ్చి పోవాలను కున్నాడు. ఇలా అనుకోవడం చాలసార్లు జరిగింది. తన కథలు వారపత్రికల నుంచి తిరిగి వచ్చేసిన రోజున చచ్చిపోవాలను కుంటూ వుంటాడు అనుకోవడమే దేశ నాయకుల వాగ్దానాలలో ఎప్పుడూ ఆచరణలో పెట్టలేదు. ఈ సారి నిజంగా చచ్చిపోవాలను కున్నాడు. ఆలశ్యం చేయకుండా ఆచరణలో పెట్టాలనుకున్నాడు.

ఆ వూరికి దగ్గరలో పాడయి పోయిన బావి వుంది. సదరు బావి చాలా మందిని పొట్టన పెట్టుకుంది. ఈ సంగతి రగ్గి చాలా సార్లు విన్నాడు. తనూ అక్కడే చావాలను కున్నాడు.

సలగని బట్టలతో నలిగిన మనస్సుతో బావి దగ్గరకు వచ్చాడు. బావిలోకి చూసాడు. లోతుగావుంది. బావిలోపడితే నలగని బట్టలు నలిగిపోతాయని చాలాబాధ పడ్డాడు. ఆఖరి సారిగా విడిస్తే బాగున్నాననుకున్నాడు. చని పోయేముందు పిచ్చిపిచ్చిగా ఆలోచించకూడ దనికూడ అనుకున్నాడు. బావిలోపడబోయాడు.

ఎవడో కాలరు గట్టిగా పట్టుకున్నాడు. బలంగా వెనక్కి లాగుతున్నాడు. రగ్గి వొక సారి నవ్వుకుని అదంతా భ్రమ అని అను కున్నాడు. తిరిగి పడబోయాడు. ఈసారి గట్టిగా లాగేడు. రగ్గి వెనక్కి తిరిగేడు.

"ఎవరు నువ్వు?" అడిగేడు నూతన వ్యక్తి.

"నన్ను వదులు. నేను చచ్చిపోతాను" పట్టుకాని కోపంతో గట్టిగా అరిచేడు

"ఎందుకు చస్తావు?" నవ్వుతూ నెమ్మదిగా అన్నాడు.

"బతకాలని యిష్టంలేక" యిష్టంలేని జవాబు చెప్పేను.

"ఏం?"

"చాలా కారణాలున్నాయి. అవన్నీ నీకన వసరం నన్నొదులు. నేను అర్జంటుగా చచ్చిపోతాను." అంటూ చిన్న పిల్లాడుల్లా మారాం చేసాడు.

"నాకు అనవసరం అనడం పెద్ద పొర పాటు. చచ్చేవాడిని రక్షించే హక్కు బ్రతి కున్న ప్రతివాడికీ వుంది. శిక్షించకుండా రక్షించేవాడు దేవుడితో సమానం. దేవుడితో అన్నీ చెప్పుకోవాలి. లేకపోతే చచ్చి పోతావు."

"దేవుడు ఎప్పుడో రాయిఅయిపోయాడు. అంటే నీవు రాయితో సమానమా?"

"నీ అతివాగుడు కట్టిపెట్టు. చచ్చిపోవ డానికి కారణం చెప్పు. చెప్పకపోయావా పోలీసులను పిలుస్తాను జాగ్రత్త!" అంటూ భయ పెట్టాడు.

"నా కథ అంతా విన్నావంటే నీవు కూడ చచ్చిపోవా లనుకుంటావు. నేను నిన్ను రక్షించాలి. అప్పుడు నేను రాయితో సమానం" నవ్వుతూ అన్నాడు.

"నేను చావను. నా గుండె రాయితో సమానం." నవ్వుతూ అన్నాడు.

"అయితే విను. నేను చాలా చాల మంచి కథలు రాస్తాను. రాసేను. చాలా బాగుంటాయి. అందులో నవరసాలు వుంటాయి. దేశాన్ని మరామత్తు చేయాలని, దేశంకోసం చాలా కథలు రాసేను. నేను యెంత మంచి కథలు రాసినా పత్రికలు వాటిని తిరుగు టపాలో త్రిప్పిపంపివేస్తున్నాయి. ఒక సారి నిజంగా మంచి కథ రాసేను, పత్రి

వ్యంగ్య రచన

కలో పడుతుందని ఆశించాను చాలా సంబర పడ్డాను. అనుకున్నట్లుగా ఆకథ అచ్చుకాలేదు. తిరిగి వచ్చేసింది అన్ని కథల్లాగానే ఈసారి యింకా బ్రహ్మాండమయిన కథ రాసేను. స్టాంపులు జతపరచని కవరు పెట్టకుండా కథను పంపేను. అయినా ఆకథ యమ ర్జెంటుగా వచ్చేసింది.

"నాలాంటి రచయిత కథలు పత్రికలలో పడకపోతే బతికి యేంలాభం అందుకే చావా లనుకున్నాను. నీవు రాయిలా వచ్చి రక్షించేవు" అంటూ రెండు బిందువులు కంటి లోంచి, మరి రెండు బిందువులు ముక్కు లోంచి రాల్చేడు.

పత్రికలలో నీకథలు పడకపోతే చచ్చి పోతావా? నేనుకూడ నీలాగే అనుకుంటే యీపాటికి అనేకసార్లు చచ్చిపోయుండాలి. నేనే కాదు కథలు రాసే ప్రతివాడు యీ పాటికి చచ్చిపోయివుండాలి. ప్రతి రచయితకి ఎప్పుడో ఒకసారి వాళ్ళ కథలు తిరిగివస్తూనే వుంటాయి. ప్రతి పత్రికలో పత్రికనిండా చచ్చిపోయిన రచయితల ఫొటోలతో జీవిత విశేషాలు కథల్లా పడుతూ వుండాలి. పత్రికలన్నీ చావుకబుర్లతో నిండి వుండాలి.

చదువుకున్న ప్రతి స్త్రీ కథలు చకచకా రాసి పారేస్తున్న యీ రోజులలో నువ్వు కథ రాస్తే తిరిగి రాక వూరుకుంటుందా? నేను అడిగిన దానికి సరయిన జవాబు చెప్పు నీ పేరు?

"రగ్గి"

"ఏ పేరుతో కథలు రాస్తూ వుంటావు"

"రగ్గి"

అదీ సంగతి రగ్గి, గిగ్గి అంటే కథలు అచ్చవుతాయా? అపర్ణ, అరుణ, రమ్యశ్రీ యిలా అందమయిన పేర్లతో కథలు రాయాలి కథలు బాగులేకపోయినా ఫర్వాలేదు. పేరు బాగుండాలి. ఇంతవరకు పత్రికలకు యెన్ని వుత్తరాలు రాసేవు?

"రాయ లేదు."

"ముందు పత్రికలను మెచ్చుకుంటూ వుత్తరాలు రాయడం నేర్చుకోవాలి. ఎలా రాస్తే అచ్చవుతాయో తెలుసుకోవాలి"

"ఎలా రాయాలో చెప్పండి సార్! నేర్చుకొని పత్రికలకు పంపుతాను" చేతులు కట్టుకుంటూ ఆతృతగా అడిగేడు రగ్గి.

"చూడు నాయనా! నీకు అంతగా తెలుసు కోవాలని వుందా? అయితే విజయనగరంలో ప్రఖ్యాత ఉత్తరకారుడు వున్నాడు. అతను చాల పత్రికలకు బోల్డు ఉత్తరాలు రాసేడు. ఆంధ్రప్రదేశ్‌లో అభిమాన ఉత్తరకారుడుగా ప్రసిద్ధిచెందేడు. పేరు మెంటుబ జగన్నాథం.

ఇక కరీంనగర్‌లో కోకొల్లలు ముఖ్యంగా ఒక దశాబ్దం నుంచి ఉత్తరాలు రాస్తూ పేరు గడించిన దుర్గశ్రీ వున్నాడు. అతని అసలు పేరు అప్పలస్వామి. "దుర్గశ్రీ" కలం పేరుతో. అనేక ఉత్తర రచనలు చేస్తూ వుంటాడు ఈ మధ్య అతను కథలు రాయడం మొదలుపెట్టేడు. అడపా తడపా పత్రికలలో పడుతున్నాయి. కుప్పలుగా ఉత్తరాలు అచ్చుపడినా గర్వంలేదు అందరితో సరదాగా మాట్లాడుతాడు. పత్రికలలో పేరు పడిందనే గర్వంలాంటి గీర్వాణం గొప్పగా వుండేది ఒకప్పుడు పత్రికలలో తన ఉత్తరం చూసి గర్వపడ్డం మానేసాడు యిప్పుడు. మొదట్లో వుత్తరం పడగానే రెండు మూడు పత్రికలు కొనేసేవాడు. ఆనందంతో తన ఉత్తరాన్ని నాలుగయిదు వీలుంటే మరో అన్నిసార్లు చదివేవాడు. ఇప్పుడు ఒకే ఒక పత్రిక కొనుక్కుని ఒకేసారి చదువుతున్నాడు. చాల మారిపోయాడు.

ఇకపోతే యాదగిరి గుట్టలో కాకా వుత్తరాలు రాసే చంద్రారావు వున్నాడు. అతడికి యే విధంగా వుత్తరం రాస్తే పత్రికలో పడుతుందో తెలుసు. తెగ వుత్తరాలు రాసేడు. ప్రతి ప్రత్యేక సంచికలోను అతని వుత్తరం వుండి తీరుతుంది. ఆ వూళ్లో అతనికి

సన్మానం చేసేరని పత్రికలలో చూసేను.

నాకు యీ ముగ్గురు మంచి మిత్రులు నా పేరు చెప్పి వాళ్ళ దగ్గర ఉత్తరాలు రాయడం నేర్చుకో" అంటూ అలసట తీరేందుకు చార్మినార్ సిగరెట్టు వెలిగించాడా వ్యక్తి.

"అయ్యా! మీ పేరు నాకు తెలియదు. నాకు ప్రాణం పోసి, ఉపదేశం చేశారు. మిమ్మలను 'గురూజి' అని పిలుస్తాను. మీరు చూపిన రాజమార్గంలోనే నేను నడుస్తాను. మీరు చెప్పిన ప్రఖ్యాత ఉత్తర కారులను కలుస్తాను. త్రిమూర్తుల్లా వున్న ముగ్గురి అభిప్రాయాలు ఆదర్శాలుగ తెలుసుకొని ఆచరిస్తాను. రాశిగా వుత్తరాలు రాసి ఆంధ్ర లోకాన్ని 'వాక' వూపు వూపుతాను. మీరు సూచించినట్లు 'మిస్ అపర్ణ' అనే కలం పేరుతో ఉత్తరాలనురాస్తాను. నాకు శలవిస్తే విజయనగరం వెళ్ళి అక్కడ వున్న మెంతుల జగన్నాథంని కలుసుకుంటాను.

"శిష్యా! నీ వుత్సాహాన్ని ఆపడం గురువుగా నావిధికాదు. నాపేరు ఆదర్శశ్రీ నువ్వు తప్పక విజయం పొందుతావు. ఇవే నాదీవెనలు."

గురూజీ దీవెనలు పొంది విజయంపొందాలని విజయనగరం బయలుదేరాడు రగ్గి.

*

"మెంతుల జగన్నాథం గారిల్లు యిదేనాండీ?"

"ఇదే! నాపేరే జగన్నాథం"

"నమస్కారం సార్! నా పేరు రగ్గి. విజయవాడ నుంచి వస్తున్నాను. మీరుఉత్తర కారులని తెలిసివచ్చేను."

"కూర్చోనాయనా!" అంటూ తన నభిమానించే పాఠకుడు వచ్చాడని పొంగిపోయాడు జగన్నాథం.

"భోజుణ్ణిచూస్తేకవిత్వంవచ్చేదో చచ్చేదో తెలియదుకాని మిమ్మలను చూస్తూవుంటే కవిత్వం పుట్టుకొస్తుంది.' అంటూ చూపిన కుర్చీలో కూర్చున్నాడు

"మీ అభిమానానికి థాంక్స్. మీరు పొగిడినంత గొప్పవాడినికాను ఏదో అప్పుడప్పుడూ రాస్తూ వుంటాను మీ రాకకు కారణం చెప్పేరు కారు."

"నేను చాల కథలు రాశాను కాని కనీసం ఒకటన్నా అచ్చుకాలేదు. అందుకే చచ్చి పోవాలను కున్నాను. దేవుడిలాంటి వారు నన్ను కాపాడి మిమ్మలను కలుసుకొని, పత్రికలకు ఉత్తరాలు రాయడం యెట్లాగో మీ వద్ద నేర్చుకోమని పంపేరు. మీరు యెలా యింతవారు అయ్యేరు." అంటూ బుద్ధిమంతుడిలా కూర్చున్నాడు.

"నా గురించి మీకు కొద్దిగా చెపుతాను. తరువాత ఉత్తరాలు యెలా రాయడమో తెలుసు కుందురుగాని."

జగన్నాథం చెప్పడం మొదలు పెట్టాడు. రగ్గి "ఊఁ' కొడుతూ వినడం మొదలు పెట్టేడు.

"నేను బరంపురంలో పుట్టేను. ఆ రోజుల్లోనే మనకు స్వరాజ్యం వచ్చింది. పెరుగుతూ పెద్దవాడినయ్యాను. బాగా చదువుకున్నాను. మీ లాగే కథలు రాయాలనే తపన మెండుగా వుండేది, చాలసార్లు రాయాలని ప్రయత్నించేను కాని రాయలేక పోయేవాడిని. కనపడిన తెలుగు పత్రికనల్లా కొనేవాడిని కథలు చదివే వాడిని ఏ కథ అయినా జాగ్రత్తగా చదివేవాడిని, చదివిన కథ పూర్తయ్యేసరికి "అరే ఈ కథ నేనే రాసి వుండవలసింది" అని అనుకుంటూ వుండే వాడిని. ఒక్కొక్కసారి "ఈ కథలో యేంవుంది? యిలాంటి కథలు నేనూ రాయగలను." యిల్లా రకరకాలుగా అనుకుని కాగితంపై కలం పెట్టేసరికి కలం కదిలేదికాదు కాగితం నిండేదికాదు. నాబుర్ర అసలుపనిచేసేదికాదు. వికలమయిన

మనస్సుతో చాలరోజులుగడిపేను. రాత్రులు నిద్రవచ్చేదికాదు చదువుకునే రోజులలో నిద్ర రాకపోతే క్లాసు పుస్తకాలు పట్టుకునే సరికి "కుంభకర్ణుడి నిద్రలా" నిద్ర వచ్చేది చక్కగా నిద్రపోయేవాడిని ఆరోజుల్లోనే బి.ఎ. పూర్తి చేసేను. ఉద్యోగం దొరికింది విజయనగరంలో. విజయనగరంలో ఉద్యోగం రాగానే ఆనందించేను సదరు ఆనందానికి కారణం లేకపోలేదు విజయనగరం కళలకు కాణాచి. నాసాహిత్య సేవకు యిక్కడే గట్టి పునాదులు వేయాలని మరి గట్టిగా అనుకున్నాను

ఉద్యోగం దొరికిన ఆర్నెల్లకి పెళ్ళయింది కొత్తకాపురం పెట్టేక నాకు పెళ్ళయిన సంతోషంలేదు. ఏపత్రికలోనూ నాకథ పడలేదనే బాధ నన్ను వెంటాడుతూనే వుండేది. ఎప్పుడూ విచారంగా, నవ్వకుండా వుండేవాడిని. నాభార్య నాబాధ అర్థం చేసుకోలేక చాలబాధ పడిపోయింది. "ఒకనాడు మిమ్మల్ని ఒక విషయం అడగాలను కుంటున్నాను అడగమంటారా?" అంటూ నావొడిలో తల దూర్చింది పాతభార్యలా. కొత్తభార్య చొరవ చూసి ఆశ్చర్య పోయాను. నావిచారానికి కారణం అడిగింది. మెల్లిగా నాకథలగురించి కథలా చెప్పేను. గంగలా వెల్లయేరులా ఏడ్చింది. నాకు వళ్లు మండింది. గట్టిగా తిట్టేను.

మూతి మూడువంకర్లు పోలేదు ఈసారి కంచుగంటలా కంఠంచేస్తూ నవ్వింది. "కథలు అచ్చుకానంత మాత్రాన బాధపడాలా మీరు? సంగతి చెప్పనా వినండి మీరు రాసిన కథలు పత్రికలో పడాలంటే ముందు 'ఉత్తరాల శీర్షిక'కి ఉత్తరాలు రాయండి ఇలా కొన్నాళ్లు సాధన చేసారంటే మీకు కథలు రాయడం వస్తుంది. పత్రికలలో మీ కథలు వస్తాయి. పెద్ద రచయితగా చలామణీ అవుతారు." నా శ్రీమతి సలహా నచ్చింది. మెచ్చేను. నా కా సంగతి తట్టనందుకు తిట్టుకున్నాను తరు వాత కనబడిన పత్రికలు కొనడం, ఉత్తరాల శీర్షిక శ్రద్ధగా చదవడం మొదలుపెట్టేను. ఉత్తరాలు రాయడం యెలా? యెట్లా రాస్తే ప్రచురిస్తారు? చాల ఖర్చు చేశాను కాలం డబ్బు ఇప్పుడు ఏ పత్రిక చూసినా నా పేరుతో ఒకటి రెండు ఉత్తరాలు ఉంటూనే వుంటాయి నన్ను పెద్దవాడిని చేసిన నా భార్యను మర్చిపోలేను ఆమె రుణం తీరా లంటే ఒకే ఒక పద్ధతి వుంది. త్వరలో నేను పత్రికలలో రాసిన ఉత్తరాలన్నీ కలిపి ఒక పుస్తకంగా అచ్చు వేయిస్తాను. సదరు పుస్తకానికి 'ఉత్తరకాండ' అని పేరు పెడతాను. దానిని నా భార్యకి అంకితం యిస్తాను."

అంతవరకు వూఁ అంటున్న రగ్గికి గొప్ప సందేహం కలిగింది.

"జగన్నాథంగారు మీ ఉత్తరకాండకి ముందు మాట యెవరిచేత రాయిస్తారు?"

నా లాగే కరీంనగర్ లో "దుర్గశ్రీ" అనే అప్పలస్వామి వున్నాడు. అతను నా మిత్రుడు. అంతేకాదు నా సమకాలిక ఉత్తమ ఉత్తరకారుడు ఆయన చేత రాయిస్తాను.

ఇకపోతే ఉత్తరాలు రాసే విధానం చెప్తాను శ్రద్ధగా వినండి. బజారులోకొచ్చే పత్రికలన్నీ అర్జంటుగా కొనేయాలి. డబ్బులు లేకపోతే అప్పారావులా అప్పు చేసయినా కొనేయాలి. ముఖచిత్రం దగ్గ ర్నుంచి అట్ట చివరి ప్రకటనవరకు పూర్తిగా చదవాలి

మొదట ముఖచిత్రాన్ని పొగడాలి. అంటే "నా అభిమాన తార" బ్రహ్మాండంగా వుంది అని. సంపాదకీయం యెలా వున్నా బాగుం దని పొగడటం ఉత్తరకారుని కనీస ధర్మం

[సశేషం]

# ఉత్తరాల కథ

-పాకనాటి బాబు

(గత సంచిక తరువాయి)

సంపాదక వర్గం నిర్వహించే శీర్షిక బాగుందని రాసేకన్నా పత్రికకు అది హైలైట్ అని రాస్తే యిక మన ఉత్తరానికి తిరుగు లేదు

ఈ పత్రికలో పడిన కథలన్నీ "అద్భా" అంటే మీరు "బద్భా" కింద లెక్క. అది ఒక్క పొరపాటే కాదు. గ్రహపాటు కింద జమ. ఈ పత్రిక అన్నిమంటే యింతకు ముందు పత్రికలో కథలు బాగులేవనేగా. కాబట్టి యీ పత్రికలో కూడ కథలు బాగున్నాయి. అని రాయాలి. పత్రికలను మెచ్చుకుంటూ రాయాలి. సునిశితమైన విమర్శలు చేయాలి కాని శృతిమించ కూడదు. ఉత్తరాలు ఒకే పత్రికకు మీరు రాస్తే ఒక ప్రక్క పేరు ప్రతిష్టలు. మరో ప్రక్క అనుభవం కలుతాయి."

"ఆగండి సార్! మీరు చెప్పినట్లు నూరు ఉత్తరాలు రాయటం మజాకా అనుకున్నారా? వారపత్రికలో విడవకుండా ప్రతి వారం రాస్తే రెండు సంవత్సరాలు పడుతుంది. మోసపోయి మాసపత్రికకు రాస్తే యెనిమిది సంవత్సరాల నాల్గుమాసాలు పడుతుంది" నీరసంగా అన్నాడు రగ్గి.

"అవును. మీ లెక్కలన్నీ కరెక్టు. అయితే మీకేమి? మీ ఉత్తరాలు పత్రికలలో పడుతూ వుంటే మీకే నాలా పుత్సాహంగా వుంటుంది. నా యీ అనుభవంతో కొత్త పత్రిక రాకుండా. పత్రిక చూడకుండా ఆ పత్రిక గురించి అద్భుతంగా ఉత్తరం రాసేగలను. ఇక మీరు సెలవు తీసుకోవచ్చు. ఇవాళ బజారుకి రెండు కొత్త పత్రికలు వస్తాయి. వాటినికొని యీ రాత్రి కూర్చొని ఉత్తరాలు రాయాలి వాటిని రాత్రి 12 గంటల ట్రెయిన్‌కి అందించాలి" అంటూ గుడ్‌బై చెప్పి రగ్గిని పంపించేశాడు జగన్నాథం.

రగ్గి జగన్నాథం కాఫీకూడ యివ్వలేదని బాధ పడలేదు. మొగమాటం లేకుండా తొందరగా పంపించేశాడని కోపం కూడ రాలేదు. ఉత్తరాలు ఎలా రాయాలో తెలుసుకున్నందుకు సరదాపడి పోయ్యాడు. ఆనందంతో కరీంనగర్ బయలు దేరాడు రగ్గి.

* * *

కరీంనగర్‌లో.

"నా పేరు రగ్గి మిమ్మల్ని కలుసుకోవాలని విజయవాడనుంచి వచ్చాను. మీరు నా అభిమాన ఉత్తమ రచయితలు మీరు చక్కని శైలిలో చిక్కని ఉత్తరాలు రాస్తారు." అంటూ తనువచ్చిన సంగతి చెప్పేడు.

"రండి. కూర్చోండి. నాకోసం అంత దూరంనుండి బోల్డు డబ్బులు ఖర్చుపెట్టి వచ్చేరు. మీరు మీవూరినుంచి వుత్తరం రాసి వుంచే మీకు ఉత్తరం రాసేవాడిని" అంటూ రగ్గికి దగ్గరలో వున్న కుర్చీలో కూర్చున్నాడు.

రగ్గి ముందుగా తనకథ చెప్పుకున్నాడు.

"మీరు రాసిన కథలన్నీ తిరిగి వచ్చేశా

యంటారా?"

"అవునండి. కథరాసి యిలాపోస్టు చెయ్యగానే అలాతిరిగి వచ్చేస్తున్నాయి. నా కథల విషయంలో తంతి తపాలాశాఖ చాలా బాగా పనిచేస్తున్నది. కొత్తగావచ్చే పత్రికలవాళ్లు కథలు తొందరగా వేసుకుంటారని. వాళ్ళ దగ్గర కథలస్టాకు. చాలతక్కువగా వుంటుందని. సరుకులో నాణ్యత స్వల్పమని యెవరో చెప్పేరు. కొత్తపత్రికలకు కొత్తకథలురాసిపంపేవాడిని,నాదురదృష్టమో పాఠకుల అదృష్టమో తెలియదు కాని ఆ కథ పంపిన మరుక్షణంనుంచి ఆ పత్రిక మరి కనబడేదికాదు. కనబడ్డమే కాదు. అది పూర్తిగా నీటి బుడగలా, విశాఖపట్నంలోని కొళాయిలోని నీళ్లలా మరి వచ్చేదికాదు. నాకు చాలా బాధగావుండేది. ఇక లాభం లేదని పత్రికలకు ఉత్తరాలు రాయాలని తీర్మానించుకొని మీ వద్దకు వచ్చేను, మీ అమూల్యమైన సలహాలు కావాలి, ఈ పది సంవత్సరాలనుంచి అనుభవం మీద తెలుసుకున్న విషయాలు నాకు చెప్పండి. ఈ మధ్య మీరు కథలు కూడ రాస్తున్నారని తెలిసింది."

రగ్గి చెప్పిన విషయాలన్నీ విన్న తరువాత అప్పలస్వామి సిగరెట్టు వెలిగిస్తూ రగ్గికి ఒక సిగరెట్టు ఆఫర్ చేశాడు. రగ్గి వద్దన్నాడు.

"ఫర్వాలేదు, కాల్చండి."

"నాకు అలవాటు లేదండి." అంటూ అలవాటు లేనందుకు సిగ్గుపడ్డాడు.

అప్పలస్వామి నిజంగా బోల్డు ఆశ్చర్యపోయాడు.

"సిగరెట్టు కాల్చడం అలవాటు లేదా?"

"లేదు."

"పక్కపొడి."

"అదీలేదు."

"మీ దగ్గర వుందా అని అడగడం లేదు. మీకు పక్కపొడి వేసుకోవడం అలవాటుందా?"

"పక్కపొడి వేసుకునే అలవాటులేదండి"

"సిగరెట్టు పక్కపొడి అలవాటు లేని మానవుడు కూడ కథలు రాయటమేనా? అందుకే మీ కథలు తిరిగి వచ్చేస్తున్నాయి. తపాలాశాఖది తప్పు కాదు, పత్రికలవాళ్ళది అంతకన్న కాదు. తప్పంతా మీదే. మిమ్మల్ని దేవుడుకూడ క్షమించడు." కాలుస్తున్న సిగరెట్టు పారేస్తూ మళ్ళీ సిగరెట్ వెలిగించాడు అప్పలస్వామి.

"నాకో చిన్న ధర్మసందేహం సార్: మరి రచయిత్రులకు సిగరెట్,పక్కపొడి వగైరా అలవాట్లుండవు కదండీ. వాళ్ళు ఎలా రాస్తున్నారు" ఈమధ్య తన బుర్ర పాదరసంలా పని చేస్తున్నదని ఉబ్బొంగిపోయాడు.

అప్పలస్వామి విగ్గరగా నవ్వి 'బాగా అడిగారు. మీలా అనుమానాలు అడిగే వారంటే నాకు చాలఇష్టం. ఈ రచయిత్రులు రచనలు చేసేటప్పుడు పక్కపొడి వేసుకుంటూరు. నాకు తెలిసిన ఒక ప్రఖ్యాతరచయిత్రి బుడ్డీకొట్టి రాస్తుంది. మంచి కథలుగాని ఉత్తరాలుగాని రాయాలంటే సిగరెట్ అలవాటు వుండితీరాలి. సిగరెట్ లేనిదే ఐడియాలు రావు. నేను ఒక ఉత్తరం రాయటానికి ఒక పెట్టె సిగరెట్లు పూడి పారేస్తాను. సిగరెట్ కాలుస్తూ పది సంవత్సరాలు రాసేను. సదరు అనుభవంతో యిప్పుడిప్పుడే కథలు గట్రా రాస్తున్నాను. నా కథలలో యెక్కువగా ఉత్తరాలు వుంటాయి. ఇప్పుడు నేను పైపైకి వస్తున్న పెద్ద రచయితను. ఆంధ్రప్రదేశ్‌లో నాలా ఉత్తరాలు రాసే వాళ్లు లేరు.

విజయనగరంలో వున్నవాళ్లు. యాదగిరిగుట్టలో వున్నవాళ్లు. యింకా తదితర గ్రామాలలో వుండి ఉత్తరాలు రాసే వాళ్లు నాకన్నా జూనియర్స్. నేను వాళ్లకన్న సీనియర్‌ని.

ఉత్తరాంలో ఒకసారి వుపయోగించిన

మాటను మరోసారి వుపయోగించను. అంతే మీకు అర్థం కాకపోవచ్చు. వివులంగా చెబుతాను.

ఒక పత్రికలో అట్టమీద చిత్రం ఫలానా వర్సమ్మ బ్యూటీగా వుంది. సంపాదకీయం బహూత్ అచ్ఛా. అదిమేము మెచ్చ. మీరు క్రొత్తగ వేస్తున్న శీర్షిక మీ (మా) పత్రికకే ఒక మెరుగు. అది అన్నింటికన్నా మెరుగు. అదే తెలుగుకి వెలుగు కథల యెంపికలో మీరు కొత్త దారి పట్టేరు. అది ఒక పట్టాన వదలకండి. ఈ విధంగా రకరకాలుగా పొగుడుతూ మనం మెచ్చేటట్లుగా రాస్తేవాళ్లు మెచ్చుకుంటారు. పత్రికలో వేస్తారు.

నోటిలో బలవంతంగా సిగరెట్ పెట్టు అంటించాడు.

రగ్గి సిగరెట్ పొగ వదలుతూ నాకథలు యెందుకు తిరిగి వస్తున్నాయో యిప్పుడు తెలిసింది. యికనుంచి ఏకధాటిగా సిగరెట్లు కాలుస్తాను. సిగరెట్లు కాలుస్తూ ఉత్తరాలు రాసి పత్రికలకు పంపుతాను." అంటూ శలవు తీసుకుని బయటపడ్డాడు రగ్గి.

యాదగిరి గుట్టలోవున్న ప్రసిద్ధి కాకా ఉత్తరాలురాసే చంద్రరావుని కలుసుకోడానికి బయల్దేరాడు రగ్గి.

* * *

యాదగిరి గుట్టలో.

"మీ పేరు?"

"రగ్గి."

"ఎవరికోసం వచ్చేరు?"

"రామచంద్రరావుగారి కోసం."

"నేనే రామచంద్రరావుని కూర్చోండి."

"నమస్కారాలు."

"నమస్తే."

"మీరు ప్రఖ్యాత రచయితలని తెలిసి వచ్చేను. మాది విజయవాడ. మీరు మా బాగా ఉత్తరాలు రాస్తారని విన్నాను. ఈ మధ్య మీకు గొప్ప సన్మానం కూడ అయిందని విన్నాను."


"అవును మా ఊరిలో చాలామందికి వుత్తరాలు రాయడం సరదా. పత్రికలకి, రేడియోలకి తరచుగా రాస్తూ వుంటారు. పత్రికలకి ఉత్తరాలు రాస్తే ఉత్తర రచయితలు, రచయిత్రులు కలిసి ఒక క్లబ్బు పెట్టుకున్నాం. దాని పేరు ఉత్తర క్లబ్బు ఈ క్లబ్బులో సుమారు నూరుమంది మెంబర్లు వున్నారు. ప్రతి నెల ఒక్కొక్కరు ఒక్కొక్క రూపాయి చందా కట్టాలి ఏ పత్రికలోనైనా ఉత్తరం పడితే ఆ సంతోషం పురస్కరించుకుని పర్సులోంచి మరో ఐదు రూపాయలు క్లబ్బుకి యివ్వడం రివాజు. బాగా వుత్తరాలు రాసే వాళ్ళకి గొప్పగా సన్మానించడం యీ క్లబ్బు ముఖ్యోద్దేశం. ఈ యేడు నన్ను సన్మానించారు, సన్మానించడానికి కారణం లేకపోలేదు. నా నూరవ ఉత్తరం [ఒకే వార పత్రికలో] యీ మధ్య పత్రికలో అచ్చయింది అందుకే యీ సన్మానం జరిగింది. సన్మానానికయ్యే ఖర్చులో సగం సన్మానం చేయించుకుంటున్నవాళ్ళు పెట్టుకోవాలి. అంటే నేను భరించాలన్నమాట. ఎక్కువగా కాదులెండి. భార్యకు రెండుపట్టు చీరెలు తీసినంత. నాల్గవవంతు క్లబ్బు పెట్టుకుంటుంది. తక్కిన ఖర్చు సభ్యులుయిస్తారు"

"మీరు వచ్చినపని చెప్పేరు కాదు" అంటూవుండగా రగ్గి సిగరెట్ వెలిగించి రావుగారి నోటిలో మరో సిగరెట్ పెట్టి అంటించాడు. "అయ్యా! నేను పత్రికలకు ఉత్తరాలు రాయాలనుకుంటున్నాను. ఉత్తరాలు రాసే మీలాంటి పెద్దలను కలుసుకుంటున్నాను. మీ శత ఉత్తరాల అనుభవం నాకు వివరిస్తూ వివరంగా చెప్పండి. వచ్చే జన్మలో మీ కడుపున పుట్టి పెద్ద రచయితగా పేరు పొంది మీకు పేరు ప్రతిష్ఠలు తెస్తాను. అంటూ అందంగా గాలిలోకి అందమైన రచయిత్రి వొంటిగ్యాజులాంటి రింగులు వదిలేడు.

అసలు పత్రికలకు ఏమి రాయాలన్నా "కాకా" ముఖ్యం. ఈ కాకానాళ్ళని మా

# 18. ఫ్లూ కాకపోతే...

## ఆరోగ్య నిధి



డా॥ ఎన్. ఆంజనేయులు

మొదటగా జలుబుచేసి ఆ తర్వాత జ్వరం, దగ్గు ఒళ్ళు నొప్పులు కనుపిస్తే సహజంగా ఫ్లూ జ్వరమని అనుకుంటాం. అనాసిన్ లాటి మాత్రలు వేసుకొని కాలం గడుపుతుంటారు చాలామంది. అది ఫ్లూ జ్వరమయితే ఫర్వాలేదు. పై లక్షణాలే న్యుమోనియాలో గూడా వుంటాయి. న్యుమోనియాను అశ్రద్ధ చేయటం అంత మంచిది కాదు. ముసలివారిలో జ్వరం తీవ్రంగా లేకపోయినా దగ్గు, ఒళ్ళు నొప్పులు మాత్రం వుంటాయి. మరో గమనించదగ్గ విషయం ఏమంటే పెదవుల పైన, ముక్కు కిరుప్రక్కల నీలం రంగు బొబ్బలు పుడతాయి దగ్గేటప్పుడు, శ్వాస పీల్చేటప్పుడు నొప్పి ప్రారంభమవుతుంది. వీలయినంతవరకు చిన్నగా శ్వాస తీసుకుంటారు. దగ్గును ఆపుకుంటారు. ఈ లక్షణాలు గమనించిన వెంటనే ఫ్లూ అనుకోక డాక్టరు సలహా పాటించి తీరాలి. పెన్సిలిన్ మందు కనిపెట్టక పూర్వం న్యుమోనియా వల్ల చాలా మరణాలు సంభవించేవి. ప్రస్తుతం మరణాల సంఖ్య తగ్గినా, ముఖ్యంగా ముసలివారు న్యుమోనియాని అశ్రద్ధ చేయటం వల్ల మరణానికి లోనవుతున్నారు న్యుమోనియాని ఫ్లూ కాదని తేల్చేది వైద్యులు పై లక్షణాలు కనుపించగానే వైద్య సలహా పొందటం మంచిది.

---

ప్రాంతంలో "చెంచాగిరి" అంటారు. మీ ప్రాంతంలో అయితే "తైరు" అంటారని విన్నాను, పత్రిక చూడగానే మరుక్షణం ఉత్తరం మొదలుపెట్టకూడదు, పూర్తిగా పత్రిక చూడాలి. చదివి సిగరెట్ కాల్చాలి. కొద్దిగా ఆలోచించాలి. అప్పుడిలా రాయాలి : "నూతన తార ముఖచిత్రంతో పత్రికకు కళ వచ్చింది, చంద్రకళ ముఖచిత్రం వుంటే మనకి ప్రాప కుదురుతుంది. అది మన అదృష్టంబట్టి వుంటుంది. ప్రస్తుత పరిస్థితుల ననుసరించి రాసిన సంపాదకీయం అద్భుతంగా వుంది. రెండు సీరియల్స్ చాల సీరియస్‌గా నడుస్తున్నాయి, కథలు సహజంగా, సరదాగా, కాలక్షేపంగా సమాజానికి దగ్గరగా వున్నాయి. సినిమాల గురించి యిస్తున్న తాజా వార్తలు చూసి మేమంతా ఆనందం పొందుతున్నాం." మీపత్రిక బాగుందని రాయకూడదు. మా పత్రిక బాగుందని కూడ రాయకూడదు. మీ (మా) పత్రిక చాల బాగుందనిరాస్తే చాల బాగుంటుంది. దీనినే "కాకా"అంటారు. కాగితంప్రింటింగు ఛార్జీలు ఆకాశాన్ని అంటుకుంటున్న యీనాడు, పత్రిక ధరపెంచక పోవడం మాకు బాధగావుంది. ఏదిఏమైనా నష్టే సంచిక

నుంచి మరో పదిపైసలు పెంచండి.

"మీకు యెట్లా పొగడ్డం వస్తే అట్లా పొగడండి. నేనుయిప్పుడు చెప్పిన అమూల్యమైన యీవిషయాలు పూర్తిగా జ్ఞాపకంవుంచుకోండి" అంటూ సిగరెట్టు పారేస్తూ మరో సిగరెట్టు వెలిగించాడు.

"మీరుసాధారణంగా ఉత్తరాలు యెప్పుడు రాస్తుంటారు?" సందేహంగా అడిగేడు రగ్గి.

"ఏమీ తోచనప్పుడు ఉత్తరాలు రాస్తాను. ఉత్తరాలు రాస్తేగాని యేమీ తోచదు." కాపీ కొట్టిన యీవాక్యాలు రగ్గికి తెలిసిపోతాయేమోనని భయపడి, విషయం మార్చాలని యిలా అన్నాడు. "మరోముఖ్య విషయం చెప్పడం మర్చిపోయాను. మీరు యింత దూరం వచ్చేరు. ఇక్కడ వున్న నరసింహస్వామిని దర్శించుకోండి. మీ వుత్తరం పత్రికలో పడితే పది కొబ్బరికాయలు కొడ్తానని మొక్కుకోండి. నామొదటి వుత్తరం పత్రికలలో పడితే నాతల (సారీ నాజుత్తు) నీకు సమర్పిస్తానన్నాను. మొక్కుకున్న వారం రోజులకే వుత్తరం పడింది. అదీ ఆ పత్రికలో మొదటి వుత్తరం నాదే. నాతల యిచ్చేను సంతోషంగా. మీవూరు వెళ్ళేముందు నాలుగు కొబ్బరికాయలు ఎడ్వాన్సుగా కొట్టి మరీ వెళ్ళండి. ఈ వూరిలో మనలాంటి వాళ్ళు పత్రికలలో వాళ్ళ వుత్తరాలు చూసి వారానికి పదిమంది వరకు దేవుడిని సందర్శిస్తూ వుంటారు, అందరూ వొక్కొక్క కొబ్బరికాయ కొట్టక మానరు.

ఈ వూరికి దేవుడు వుంటున్నది ఉత్తరాన అందుకేకాబోలు మొక్కుకుంటేపత్రికలలో వుత్తరం పడి తీరుతుంది. మిమ్మల్ని చాలా బోరెను. నన్ను 'బోరుశ్రీ' అనుకునేరు." అంటూ గోడకుతగిలించిన నరసింహస్వామి పటానికి దండంపెట్టేడు. కాకా వుత్తరాలు రాసే చంద్రారావు.

పక్కపొడి నములుతూ రగ్గి భక్తితో "అలా అనకండి. మిమ్మల్ని 'బోరుశ్రీ' అనే పాటి వాడినా? మీరు నాకు చాలా కొత్త సంగతులు చెప్పేరు. నాకిక శలవిస్తే నరసింహస్వామిని దర్శించుకుని వెళ్ళిపోతాను" అంటూ శలవు తీసికొని దేవుణ్ణి దర్శించడానికి బయలుదేరాడు.

* * *

నాలు సిగరెట్లు పెట్టెలు, అరకిలో పక్కపొడి కొని వస్తూవుంటే అప్పుడే వచ్చిన కొత్త పత్రికను చూసాడు. పట్టరాని సంతోషంతో అది శుభ సూచకమే అనుకున్నాడు, మరుక్షణమే పత్రిక కొన్నాడు రగ్గి.

కొత్తగాకొన్న ఈజీచైర్‌లో కూర్చొని కాఫీగసిగరెట్టుకాలుస్తూ పత్రికముఖచిత్రాన్ని తనివితీరా చూడ్డం మొదలుపెట్టేడు. అందులో లీనమైపోయాడు. అప్పుడే కాఫీ కలిపి కప్పుతో భార్య రగ్గి దగ్గరకు వచ్చింది. రగ్గినిచూసి ఆశ్చర్యపోయింది. ఆరున్నొక్క రాగం మొదలుపెట్టింది. ఎంత బిగ్గరగా ఏడ్చినా రగ్గికి వినబడలేదు. చెడు అలవాట్లు లేని తన భర్త సిగరెట్ కాలుస్తున్నాడు. అట్టపైని అందమైన ముఖచిత్రాన్ని అదేపనిగా చూస్తూవుంటే ఏడుపు ఆపుకోలేకపోయింది. "కాఫీ తీసుకోండి" అంటూ కాఫీ యిచ్చింది. కాఫీతాగి పక్కపొడి వేసుకుని సిగరెట్ కాలుస్తూ పత్రిక పూర్తిగ చదివేడు బ్రహ్మాండమైన ఉత్తరం రాయాలనుకున్నాడు, అనుకోవటమేతరువాయి. కాగితం కలం పట్టుకొని "స్వామీ! నరసింహస్వామి నేను రాస్తున్న ఈఉత్తరం పత్రికలో అచ్చయితే నా యీ ఉత్తరం ప్రచురించిన పత్రికతో సహా నీ కొండకు వచ్చి తలనీలాలు సమర్పించుకుంటాను." అని మొక్కుకుని దిక్కులేని భాష తెలుగు భాష అనుకొని ఉత్తర దిక్కున కూర్చొని ఉత్తరప్రశావ

# బుల్లి బుల్లి యిసిత్రాలు

—రంధి సోమరాజు

డబ్బును పంచిత్తున్నట్టు
నీ అందాన్ని
మా అందరికీ పంచియే
అన్నాడో బుల్లోడు
వోరి దొంగసచ్చినోడా
ఆ డబ్బుకు బుర్ర నేదు
నాకుందే హో
అందంట ఆబుల్లి ।

* * *

క్రిట్నమూర్తులోరు
గుంటల్తో సెకతిరిగితే
అదేటో లీల అన్నారు
మా రంగినాయుడు తిరిగితే
ఆడ్ని పోరంబోకోడన్నారు
గొప్పోల్లు పూజిత్తే
"అమ్మవారు"
కూడులేనోలు పూజిత్తే
"అమ్మోరు"
అన్నట్టుంది కద్రా
బుజ్జికిట్నుడూ

* * *

ఆడోలకి
సోతంత్రం వొచ్చిందంట
నిజమా బాబూ అంటే ....
ఆ బాబు
అలుకూడా
మగోల మద్దెన
సుకంగా బూతులాడినప్పుడే
ఆలకి
సోతంత్రం వొచ్చినట్టున్నాద్రోరే ।

*

అలవాటుకేమొ
మడ్సి బానిసై సత్తాడంట
అదే నేకపోతే
ఆడికి పిసరంత కూడ
పనితనం వుండదంట
బానిస కాకుండ
పనితనం పోకుండ
మోలీవోడ్నా నడ్సే మడ్సే
మా గొప్పోడంట ।

ఉత్తరం వ్రాయటం మొదలు పెట్టేడు.

ఎడిటర్జీ,

నమస్తే. మా (మీ) పత్రిక చూసేను. (ఎప్పుడూ చూస్తూ వుంటాను.) అట్టపైనున్న ముఖచిత్రం చూడగానే ముఖం తిరిగిపోయింది. నా అభిమాన తార అప్పలమ్మ (సారీ, ప్రభగా పేరుమార్చుకుంది)గారి ముఖచిత్రం పత్రికకు శోభనిచ్చింది. మీరు రాసిన సంపాదకీయం కళ్ళకు కట్టినట్లున్నది. ఇంత బాగా రాశారంటే అదంతా మీ స్వానుభవమే.

ఇకపోతే మీరు నిర్వహిస్తున్న 'ఆణిముత్యాలు' అద్భుతంగా వుంది. ప్రతివారం ఆశీర్షికని ప్రచురించండి. మువ్వురుగ్గావున్న మూడు సీరియల్స్ చదువుతూవుంటే చాలా భయం వేస్తుంది. ఎందుకనుకున్నారు? అవి చదివేస్తే అయిపోతాయని భయం. కథల విషయంలో మీరు ఎన్నుకుంటున్న, నిదానం

చూస్తే పత్రిక స్టేండర్డు కాబూలీ వాలా అప్పులా పెరిగిపోతుంది. కార్టూన్స్ చాల నవ్విస్తున్నాయి. కొత్త పత్రిక వచ్చేవరకు నోరారా నవ్వుకోవచ్చు. ప్రింటింగు చాల ముచ్చటగా వుంది. పత్రిక వెల మరో పది పైసలు పెంచండి, మీ (మా) పత్రిక ఆంధ్ర పాఠక లోకంలో నాల్గు కాలాలపాటు విజయ విహారం చేయాలని దేవుని ప్రార్థిస్తూ ముగిస్తున్నాను.

పత్రిక శ్రేయోభిలాషి
కుమారి అపర్ణ
(విజయవాడ)

(తా॥ క॥): ఉత్తరాల శీర్షికకు మరో రెండు పేజీలు కేటాయిస్తే మేమంతా ఆనందిస్తాం. — అపర్ణ.

సంపాదకులకు,

నమస్కారములు. మీకు పంపుతున్న యీ చిన్న వుత్తరం నచ్చుతుందని ఆశిస్తాను. ఇది దేనికి అనువాదంకాదు. అనుసరణ అంతకన్నా కాదని మనవి. కేవలం నా సొంతం దీని కాపీ మరే యితర పత్రికలకు పంపలేదు. ఈ వుత్తరం వలన వుత్పన్నమయే అన్ని చిక్కులకు అన్ని బాధ్యతలు నావేనని యిందు మూలంగా హామీనిస్తున్నాను. మీరు దీనిని [నా మొదటి వుత్తరాన్ని] ప్రచురించనియెడల త్రిప్పి పంపవలసిందిగా కోరుతున్నాను. స్టాంపులు జతపరచిన కవరు పంపుతున్నాను. నా కలంపేరు కుమారి "అపర్ణ"

మరి వుంటా.
నా అసలు పేరు
రగ్గి.

రగ్గి సిగరెట్ కాలుస్తూ యేవో లెటర్స్ రాసి నాల్గుసార్లు చదువుకున్నాడు. కవరులో పెట్టి పోస్టు చేయడానికి బయలుదేరాడు. కవరు పోస్టుచేసి వస్తూ బజారులో అప్పుడే వచ్చిన సుచిత్ర మాసపత్రిక కొన్నాడు. ఉత్తరం రాయడానికి త్వరత్వరగా యింటికి వచ్చాడు.

భార్య యెదురువచ్చి "ఏమండీ మీరు పత్రికకు రాసిన వుత్తరం వచ్చేసింది." నవ్వుతూ కవరు యిచ్చింది.

అవును. అది తాను రాసిన కవరే; తన చిరునామా తాను రాసి పంపినకవరు అప్పుడే ఎట్లా వచ్చింది అనుకుంటూ యేడ్చినంత పని చేసాడు.

"చూడండి మీ చిరునామా రాసి తపాలా బిళ్లలు జత పరిచిన కవరులో, పత్రికకు రాసిన రెండు వుత్తరాలు పెట్టేరు. దానిని పోస్టు చేసారు. ఆ కవరులో పత్రికచిరునామా వున్న కవరు కూడ వుంది. మీ పొరపాటు వలన యిదంతా జరిగింది." అంటూ వంట చెయ్యడానికి వెళ్లిపోయింది.

పత్రికలలో ఉత్తరం పడాలంటే చాల అదృష్టం వుండాలి. ఇకనుంచి పత్రికలకు వుత్తరాలు గాని చివరికి ప్రశ్నల శీర్షికకు ప్రశ్నలు గాని పంపకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఇకనుంచి అనవసరంగా చావకూడదని కూడా అనుకున్నాడు రగ్గి. ★

## వినాయకులు

– బులుసు కామేశ్వరరావు

దేశమును ద్వేషించువారు
మంచి అన్నది త్రెంచువారు
పొట్టి మాటలు తల పెట్టువారు
గట్టి మేలు కట్టి పెట్టువారు
స్వంత లాభం అసలు మానరు
పొరుగువారికి తోడుపడరు
వారే మన నాయకులు
దేశానికి వినాయకులు.